క్లుప్తంగా

పెదపట్నంలంకలో సప్తాహం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారి పాలెం రామాలయం వద్ద గురువారం సప్తాహం సీతా సమేత పట్టాభిరామ అఖండ శ్రీరామ నామ సర్వనామ అయిదో సప్తాహం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 6.59 గంటలకు కంచి వీరదుర్గా రావు, సత్యప్రియ దంపతులతో బ్రహ్మశ్రీ గాడేపల్లి సీతారామశాస్త్రి కలశస్థాపన చేయించారు. దీనిలో భాగంగా శ్రీరామనామ సర్వనామ కీర్తనలతో భజన నిర్వహిస్తున్నారు. ఈ సప్తాహం ఈ నెల 21వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సప్తాహంలో భాగంగా పలువురు భక్తులు, పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



రెడ్‌క్రాస్ సాయాన్ని అందిస్తున్న బుజ్జిరాజు

రాజోలు: ఇటీవల పొన్నమండలో అగ్నిప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన బాధితుడు కోరుకొండ వెంకట్రావు, శ్రీనివాసరావు కుటుంబాలకు గురువారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సాయం అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు టార్పాలిన్లు, వంటసామగ్రి, హైజెనిక్ కిట్స్‌ను రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల రెడ్‌క్రాస్ సంస్థ సమన్వయకర్త జంపన బుజ్జిరాజు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా సహాయ కార్యదర్శి బోనంరాజు, నాయకులు కడలి మోహన్, కుక్కల స్టాలిన్, పుల్లేటికుర్తి రత్నారావు, ముదునూరి పండురాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం

అయినవిల్లి: మండలంలోని విలసలో బీరవారిపేట వద్ద గ్రామపంచాయతీ నిధులు రూ.15 లక్షలతో వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చిన బాబు, సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్, మాగాం సర్పంచ్ కాశి వీరవెంకట సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారి పాలెంలో వీరభద్రస్వామి సంబరం గురువారం ఘనంగా జరిగింది. మేళ, తాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ సంబరాన్ని ఆద్యంతం వైభవంగా జరిపించారు. మామిడిశెట్టి వీరవెంకటసత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరంలో భాగంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వైనతేయ గోదావరి నదీ స్నానం, నది వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంబరంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

అయినవిల్లి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2021–22లో చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ హౌసింగ్ డీఈ కె.సుజాత కోరారు. గురువారం మండలంలోని అయినవిల్లి తదితర గ్రామాల్లో ఆమె పర్యటించారు. వివిధ స్టేజిల్లో లబ్ధిదారుల ఇళ్లను ఆమె పరిశీలించారు. అయినవిల్లి మండలంలోని గ్రామీణ్ పథకంలో 801 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో 227 మాత్రమే నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ కె.శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేశ్వరావు తదితరులు ఉన్నారు.

అరటిలో బంచ్ ఫీడింగ్‌పై రైతులకు అవగాహన

ఆలమూరు: అరటితోటల్లో నాణ్యమైన అరటి గెలలను పొందటానికి తోడ్పడే బంచ్ ఫీడింగ్ విధానంపై అవగాహన సదస్సు జరిగింది. మండలంలోని చెముడులంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతనత గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్న గూడెంకు చెందిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలకి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బంచ్ ఫీడింగ్ చేయాల్సిన విధానాన్ని వివరించి కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం స్థానిక అరటితోటల్లో బంచ్ ఫీడింగ్ విధానాన్ని ఉద్యాన రైతులకు సమగ్రంగా వివరించారు. 10 నెలల వయసు ఉన్న అరటి చెట్టు గెలకి వేసిన పువ్వును తొలగించి ఆవుపేడ, యూరియా, నీరుతో సొంతంగా తయారు చేసుకున్న మిశ్రమాన్ని అందులో ఉంచాలన్నారు. మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, తమ్మన హరికృష్ణ, అడబాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మామిడికుదురు: అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు గురువారం సర్పంచ్ గెడ్డం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ పరీక్ష సామగ్రి అందజేశారు. రిటైర్డ్ టీచర్ గెడ్డం విజయలక్ష్మి స్మారకార్థం వీటిని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బావరాజు సూర్యప్రకాశరావు, గెడ్డం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- నియోజకవర్గ కోఆర్డినేటర్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు



మామిడికుదురులో వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి, ఎమ్మెల్యే కొండేటి

మామిడికుదురు: మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సభలో 2,679 మందికి రూ.5.02 కోట్ల వైఎస్సార్ చేయూత సహాయం చెక్కును అందజేశారు. సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రతి ఒక్కరి మేలు కోరుకునే జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎక్కడా మాట తప్పకుండా, మడమ తిప్పకుండా పాలన సాగించిన జగన్‌కు ప్రజల ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్య, యూవీవీ సత్యనారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, సర్పంచ్‌లు గెడ్డం మంగాలక్ష్మి, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు వర్దినేని రాము, బొంతు నీలిమ తదితరులు పాల్గొన్నారు. మొగలికుదురులో రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు గురువారం ప్రారంభించారు.

పి.గన్నవరం: సీఎం జగన్ పాలనలో మహిళలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందారని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాలుగో విడత వైఎస్సార్ చేయూత పంపిణీలో భాగంగా మండలంలోని 4200 మంది మహిళలకు ఒక్కొక్కరికీ రూ.18,750ల వంతున మొత్తం రూ.7,87,50,000ల నమూనా చెక్కును గురువారం వారు అందజేశారు. అనంతరం మహిళలతో కలసి సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మహిళలకు జగన్‌మోహన్ రెడ్డి వివిధ సంక్షేమ పథకాలతో ఆర్థిక సాయం అందించి ఆదుకుంటున్నారని టీడీపీకి చెందిన సర్పంచ్‌లు బొండాడ నాగమణి, బీర వెంకమాంబలు అభినందించారు. జగన్ పాలనలో మహిళలు ఆర్థికంగా బలపడ్డారని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, గుడాల రామారావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకట శివరామన్, పితాని నర్సింహారావు, యన్నాబత్తుల ఆనంద్, కుంపట్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ బలగాల కవాతు

పి.గన్నవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కొత్తపేట డీఎస్పీ ఆదేశాలతో మండలంలో సమస్యాత్మక గ్రామాలైన నరేంద్రపురం, ముంగండ సెంటర్లలో గురువారం సీఐఎస్ఎఫ్ బలగాలు సాయుధ కవాతు నిర్వహించారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రు సచివాలయం వద్ద నిర్వహించిన 104 వైద్య సేవలను ఎంపీపీ గురువారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసే జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలను రోగులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య సేవలు అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అంబాజీపేట: పరిసరాలతో పాటు గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ కార్పొరేషన్ మంజూరు చేసిన డస్ట్‌బిన్లను గంగలకుర్రు సచివాలయం వద్ద గ్రామస్తులకు గురువారం అందజేశారు. సర్పంచ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సత్యవేణి మాట్లాడుతూ తడి, పొడి చెత్తలు వేసేందుకు రెండు డస్ట్‌బిన్లను అందిస్తున్నామన్నారు. ఆ రెండు డస్ట్‌బిన్లలో చెత్తను వేయాలన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో పీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో మండలంలోని 16 గ్రామ పంచాయతీల కార్యదర్శులు (గ్రేడ్–1 నుంచి 5 వరకూ), వీఆర్వోలు, మహిళా పోలీసులకు ఇందుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ కింద చేయవలసినవి, చేయకూడనవి గురించి మండల స్పెషల్ ఆఫీసర్ సిద్ధార్థ వర్ధన్, ఎంపీడీవోలు వివరించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, తహసీల్దారు సీహెచ్ పెద్దిరాజు, ఎంఈవో–1 డి.కిషోర్‌కుమార్, సఖినేటిపల్లి పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకంఠ జయంతి

అంబాజీపేట: ఆదిగురువు శ్రీకంఠ శివాచార్యులు జయంతి పురస్కరించుకుని ఆదిశైవ అర్చకుల గురువుల జయంతి మహోత్సవాన్ని అంబాజీపేటలో వేంచేసిన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద వైభవంగా గురువారం నిర్వహించారు. ఆదిశైవ మండల శాఖ అధ్యక్షుడు కొత్తలంక విజయభాస్కర్ (బుజ్జి), గౌరవ అధ్యక్షుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి, కార్యదర్శి గూడూరి వీరభద్రం ఆధ్వర్యంలో అంబాజీపేట, కొత్తపేట, పిగన్నవరం మండలాల్లోని అర్చక గురువులు వారి కుటుంబాల జయంతి మహోత్సవాలను ఘనంగా చేశారు. ఇటువంటి మహోత్సవాలను ప్రతి చోట నిర్వహించాలన్నారు. ఆదిగురువైన శ్రీకంఠ శివాచార్యులు వారి విగ్రహాన్ని ప్రతి శివాలయంలోనూ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న ఆదిశైవులు అందరూ శైవాగమ పాఠశాలలకు ఆర్థిక సహకారాలు, ప్రోత్సాహాన్ని అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఆదిశైవ అర్చకులు, గురువులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వెల్లివిరుస్తున్న సంక్షేమం



చింతలపల్లిలో ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో సంక్షేమం వెల్లివిరుస్తోందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం చింతలపల్లి, కూనవరం గ్రామాల్లో నూతనంగా నిర్మాణం చేసిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. అలాగే చింతలపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. 104, 108 వాహన సేవలను గ్రామాల్లో విరివిగా అందిస్తున్నారన్నారు. ప్రజలు సుదూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లనవసరం లేకుండా హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఎంతో ఉపయోగంగా నిలుస్తున్నాయన్నారు. చింతలపల్లి, కూనవరం సర్పంచ్‌లు మట్టా ప్రసన్నకుమారి, బోనం అచ్యయనాథం, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, మట్టా ప్రసన్నకుమారి, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, పార్టీ నాయకులు మట్టా సురేష్, తెన్నేటి కిషోర్, నల్లి నాగబాబు, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పచ్చమూకల వికృత చేష్టలపై ఆగ్రహం



అంబాజీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న మహిళలు, నాయకులు

అంబాజీపేట: ప్రభుత్వం మంచి చేసిందని చెప్పినందుకే తెనాలికి చెందిన గీతాంజలిపై పచ్చమూకలు పనికట్టుకుని దాడి చేశాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబాజీపేటలో మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో గీతాంజలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

అయినవిల్లి: గీతాంజలి మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముక్తేశ్వరంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి క్యాండిల్స్‌తో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, కామన కృష్ణమూర్తి, కాశి వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: తెనాలికి చెందిన గొర్రె గీతాంజలి మృతికి సంతాపంగా వైఎస్సార్ సీపీ నేతలు గురువారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. గీతాజలి అమర్ రహే, గీతాంజలి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు కొమ్ముల రాము, తోరం సూర్యభాస్కర్, కొనుకు నాగరాజు, జక్కంపూడి వాసు, యూవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: గీతాంజలి ఆత్మహత్యకు కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం మండల శాఖ అధ్యక్షురాలు పోతుల చంద్రావతి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చంద్రావతి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ వలన తనకు చేకూరిన లబ్ధిని, వాస్తవ విషయాలను మీడియాకు చెప్పిందన్నారు. దానిపై సోషల్‌మీడియాలో ట్రోల్ చేయడం వల్లే గీతాంజలి తీవ్ర మానసిక క్షోభకు గురైందన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం



విశ్వేశ్వరాయపురంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్ రెడ్డినే మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. గురువారం మండలంలోని లక్కవరం, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కూడా అమలు జరగాలంటే జగనే అధికారంలో ఉండాలని అన్నారు. లేకుంటే ఆగిపోతాయని పేర్కొన్నారు. జగన్ సీఎం అయ్యాక ప్రజలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, సర్పంచ్‌లు చెల్లుబోయిన హెలీనా, కోట పుష్ప కుమారి, కొడవటి దొరబాబు, గుబ్బల రమేష్, గుబ్బల సత్యనారాయణ, ఆర్‌సీవీ రాజు, కార్యదర్శులు రేకపల్లి యేసుబాబు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

సుడిదోమతో వరి పంటకు అధిక నష్టం

అయినవిల్లి: సుడిదోమ వరి పంటను ఆశిస్తే అధిక నష్టం వాటిల్లుతోందని అమలాపురం ఏడీఏ ఎంఏ షంషీ తెలిపారు. గురువారం అయినవిల్లి మండలంలోని సిరిపల్లిలో ఆత్మ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఏ షంషీ ముఖ్యఅతిథిగా హాజరై వరిని ఆశించే సుడిదోమ నివారణ చర్యలను రైతులకు వివరించారు. సుడిదోమ నివారణకు ట్రిఫ్లూమిజోపిరిమ్ 10 శాతం ఎస్సీ 0.47 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి ఒక ఎకరానికి 200 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా నీటితడులు సక్రమంగా ఇవ్వాలన్నారు. 5 మీటర్ల లోతు నీరు ఉండేటట్లు చూడాలని సూచించారు. అలాగే ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నందకిషోర్ కలుపు నివారణకు 2.40 సోడియం 500 గ్రాముల ఒక ఎకరానికి కలుపు మొక్కలపై పడేటట్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి, ఏఓ వై.శోభ, టెక్నికల్ ఏఓ మనోహర్ తదితరులు ఉన్నారు.

గ్లకోమా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: మధ్య వయస్కుల్లో సాధారణంగా సంభవించే గ్లకోమా వ్యాధిపై సరైన అవగాహన పెంచుకుని నివారణకు కృషి చేయాలని కొత్తపేట అదనపు డీఎంహెచ్ఓ ఎం.సుమలత కోరారు. గ్లకోమా నివారణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని చొప్పెల్ల పీహెచ్‌సీలో వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ 40 ఏళ్ల వయసు పైబడిన వారు గ్లకోమా పరీక్షను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గ్లకోమా కంటి వ్యాధికి సంబంధించి జిల్లా కేంద్రమైన అమలాపురం ఏరియా అస్పత్రిలో ఉచితంగా ప్రత్యేక చికిత్స విధానం అమలులో ఉందని ఆమె పేర్కొన్నారు. నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఆర్.బాలామణి, ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వానపల్లిలో పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కర్

కొత్తపేట: సీఎం జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులైన ప్రజల ఆదరణతో మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం ఖాయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజాప్రయోజనాలు) నేమాని భాస్కరరామం (భాస్కర్) అన్నారు. మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు బండారు వెంకటసుబ్బారావు, బండారు వెర్రియ్య, బండారు వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి శ్రీనివాసరావు, విస్సాప్రగడ వెంకటసుబ్బారావు, అయ్యల సోమయాజుల రామకృష్ణ, చల్లాప్రగడ హనుమంతరావు, బండారు సత్తిబాబు, బండారు నాగేంద్ర ప్రసాద్ తదితరులు ఆయా పార్టీలకు రాజీనామా చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు భాస్కర్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం సాయంత్రం వానపల్లి రంగా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి జగ్గిరెడ్డి, భాస్కర్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, డీసీసీబీ పర్సన్ బండారు రాజా, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం



రావులపాలెంలో వాటర్ ట్యాంక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: గ్రామంలోని సీఆర్సీ రోడ్డులో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.3.13 కోట్లతో నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి పనులను గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. అలాగే పోతంశెట్టి రామిరెడ్డి పార్కు పక్కన రూ.6 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను, చిర్ల సోమసుందర రెడ్డి నగర్‌లో రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

ఆలమూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రానున్న దృష్ట్యా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆలమూరు, కొత్తూరు, చింతలూరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి గ్రామాల మీదుగా సీఆర్‌పీఎఫ్ దళాల కవాతు గురువారం జరిగింది. పలు కూడళ్లలో సీఐ రామ్‌కుమార్, ఎస్సై శ్రీనునాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ, అమలులో ఉంటున్న చట్టాలను ప్రజలకు సమగ్రంగా వివరించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. గ్రామాల్లో కాని పోలింగ్ బూత్‌ల వద్ద కాని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే సత్వరమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.











